క్లుప్తంగా

ఆధునికీరణ దిశగా రేపల్లె రైల్వేస్టేషన్



రేపల్లె: ఆధునికీకరణలో భాగంగా గుంటూరు డివిజన్‌లో 16 రైల్వేస్టేషన్లు గుర్తించామని, వాటిలో రేపల్లె కూడా ఒకటని డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. రేపల్లె రైల్వేస్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆధునికీకరణలో పాసింజర్ల సౌకర్యాలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. అప్రోచ్ రోడ్డు, ప్లాట్‌ఫామ్‌ల సెంటర్స్ వెడల్పు, ఏసీ వెయిటింగ్ హాలు, మహిళలకు ప్రత్యేకంగా వేచి ఉండే గది, తాగునీటి తదితర సౌకర్యాల్ని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. బస్టాండ్ వైపు రైల్వే ద్వారాన్ని సైతం అభివృద్ధి చేస్తామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట రైల్వే సిబ్బంది ఉన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలకు 32 మంది హాజరు



రేపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన టైప్ రైటింగ్ పరీక్షలకు 32 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్, టైప్ రైటింగ్ ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌కి ఆరుగురు, లోయర్ గ్రేడ్‌కి 19 మంది, తెలుగు లోయర్ గ్రేడ్‌కి ఒక్కరు, ఇంగ్లిష్ హయ్యర్ గ్రేడ్‌కి ఐదుగురు, తెలుగు హయ్యర్‌కు ఒకరు హాజరైనట్లు ఆయన వివరించారు.

నేడు చందోలులో వైఎస్సార్ స్మారక సైకిల్ స్పీడ్ పోటీలు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో ఆదివారం వైఎస్సార్ స్మారక సైకిల్ స్పీడ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్ తెలిపారు. చందోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియజేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు చందోలు నుంచి సైకిల్ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాల్గొన దలచిన వారు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. చందోలు నుంచి రెడ్డిపాలెం, పిట్టువారిపాలెం, ఖాజీపాలెం, అలకాపురం, అల్లూరు, రెడ్లపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల మీదగా చందోలు చేరుకోవాల్సి ఉంటుందని వివరించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.12 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ. 7వేలు, ఆరో బహుమతిగా రూ.5 వేలతో పాటు షీల్డులు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత మునీర్, పోటీల నిర్వాహకులు జుల్ఫిఖార్ బేగ్, సుమన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ అంకురార్పణ



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులోని శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణం, నవ కుంభారోపణం శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామికి నిత్య హోమం, బలిహరణ, భేరిపూజ, జరిగింది. రాత్రి నిత్య కార్యక్రమాలతో పాటు యారోత్సవం నిర్వహించారు. ఆదివారం స్వామి కల్యాణం అనంతరం గరుడోత్సవం జరుగుతుందని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంఠమనేని హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమాల్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తనిఖీ

బాపట్ల అర్బన్: కళాశాలల ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.రామజోత్స్నకుమారి శనివారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాపట్ల పరిసర ప్రాంతాల వారికి అవగాహన కల్పించి కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రవేశం పెంచాలని అధ్యాపకులకు చెప్పారు. రెగ్యులర్ తరగతులు నిర్వహించి హాజరుశాతం పెంచాలని ఆదేశించారు. నూతన విద్యా విధానం అనుగుణంగా నైపుణ్య విద్య అందరికీ అందించాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మాల్యాద్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాల కల్పన

బాపట్ల జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు



భట్టిప్రోలు కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

భట్టిప్రోలు: జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాల్ని కల్పించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు తెలిపారు. గృహ నిర్మాణాల్లో భట్టిప్రోలు వెనుకంజలో ఉండటంతో పరిస్థితిని సమీక్షించేందుకు శనివారం ఆయన కాలనీకి విచ్చేశారు. సమస్యలపై లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణానికి నీరు సమస్యగా ఉందని పలువురు చెప్పారు. అంతర్గత రహదారుల్లోనూ విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. స్పందించిన జేసీ లే-అవుట్‌లో సోమవారం నాటికల్లా మౌలిక వసతులు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, పలు శాఖల అధికారులు ఉన్నారు.

వైభవంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం

భట్టిప్రోలు: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి పొన్నమాను ఉత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిరువీధుల బాలాజీ, శ్రీధర్ పర్యవేక్షించారు. ఆదివారం రాత్రి ఆలయంలో జగజ్యోతి, ఎదురుకోల మహోత్సవాలు వైభవంగా జరగనుంది. అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం స్వామి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పిస్తుంది. కల్యాణ మహోత్సవంలో జగ్గారపు సూర్యన్నారాయణ-సామ్రాజ్యం దంపతులు పాల్గొననున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సం సోమవారం సాయంత్రం జరుగనున్నది. కార్యక్రమాల్ని కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, ఫౌండర్ ట్రస్టీలు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పర్యవేక్షిస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన భూమిక అయిన రథోత్సవానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు కోరారు.

నూరు శాతం ఇళ్ల నిర్మాణమే లక్ష్యం



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లె: జగనన్న కాలనీలో నూరు శాతం గృహ నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారుల్ని సచివాలయ సిబ్బంది చైతన్యపరచాలని తహసీల్దార్ మల్లికార్జున రావు తెలిపారు. పట్టణంలోని 18వ వార్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో సచివాలయ సిబ్బందితో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత మంది ఇప్పటికే కాలనీలో నివాసం ఉంటున్నారన్నారు. మిగిలిన వారు కూడా నిర్మాణాలు వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. లబ్ధిదారులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న రూరల్ ఎస్ఐ వెంకటప్రసాద్

బాపట్ల టౌన్: పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ తెలిపారు. గుంటూరు నల్లచెరువుకు చెందిన చిన్నారులు హమీద్, లాలా జాన్ బాషా, తాటి తరుణ్, తాటి భూషణం, ఇమామ్ సూర్యలంక తీరంలో శనివారం అనుమానాస్పదంగా సంచరిస్తుండంతో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వారిని అదుపులోకి తీసుకొని ఎస్ఐ వెంకటప్రసాద్‌కి అప్పగించారు. ఆయన విచారించి చిన్నారుల్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు పాఠశాలకు సక్రమంగా వెళ్లి, తిరిగి వస్తున్నారా.. లేదా ? అనే విషయాలపై జాగ్రత్తలు వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు రాని విద్యార్థుల సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

సీఎం జగన్ చిత్రపటానికి ముస్లిం పెద్దల క్షీరాభిషేకం

తెనాలి: పట్టణంలో ముస్లింల కోసం ప్రత్యేకంగా షాదీఖానా నిర్మాణానికి కృషిచేసి, అడిగిన వెంటనే రూ.4 కోట్లను కేటాయించినట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం జగన్ చిత్రపటానికి ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ముస్లిం పెద్దలు, ముతవల్లీలు పాల్గొన్న సమావేశంలో షాదీఖానా ఆవశ్యకతను గుర్తించిన ఎమ్మెల్యే శివకుమార్, రైతుభరోసా సాయం పంపిణీకి తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించటం, ఆయన పెద్దమనసుతో రూ.4 కోట్ల నిధులను కేటాయించటంపై వారంతా హర్షం వ్యక్తంచేశారు. డాక్టర్ రియాజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింలపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న ఆదరణ గొప్పగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ముస్లిం మహిళను తొలిసారిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎమ్మెల్యే శివకుమార్, ప్రస్తుతం ముస్లిం సోదరులకు ఎప్పట్నుంచో కలగానే మిగిలిపోయిన షాదీఖానా సాకారానికి తోడ్పడినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే శివకుమార్‌లు ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ముస్లిం పెద్దలు గోల్డ్ రహిమా, జేబీ జిలాని, ముఫ్తీ అల్లావుద్దీన్, షేక్ షబ్బీర్, ముఫ్తీ రియాజ్, ముఫ్తీ హైదర్‌ఆలీ, సయ్యద్ గౌస్, పెచ్చింగ్ సుభాని, షేక్ మీరావలి, పెదరావూరు ఫరీద్, మారుల్లా, రెడీమేడ్ సలీమ్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

కొల్లిపర: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, నిత్యం ప్రజలకు నిర్మాణాలపై అవగాహన కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, శివలూరు గ్రామాలలో జగనన్న కాలనీలో లేఔట్లను శనివారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మాణాల ప్రగతి తక్కువగా ఉందని దీన్ని మెరుగుపరిచేందుకు లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు జరిగేటట్టుగా కృషి చేయాలని చెప్పారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల పురోగతి పూర్తిస్థాయిలో సాధించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ప్రయాణికులకు అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అలెగ్జాండర్

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని శ్యామ్ అండ్ జైన్ సంస్థ ఫౌండర్ వి.అలెగ్జాండర్, టీబీ యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. ప్రపంచ టీబీ డేలో భాగంగా తెనాలి బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.ఆర్.ఎల్. వర్మ, ఆర్టీసీ ఉద్యోగి ఈ.ప్రేమ్‌కుమార్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



చెరుకుపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని పొన్నపల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దుండి శ్రీనివాసరెడ్డికి చెందిన పూరి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి పూర్తిగా కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ పైనం బసవపున్నమ్మ వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆదేశాల మేరకు ఆమె వైస్ ఎంపీపీ పైనం రంగారెడ్డితో కలసి బాధిత కుటుంబానికి రూ.10వేలతో పాటు బియ్యం నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు దొంతిబోయిన సంజీవరెడ్డి, గ్రామ పెద్దలు దుండి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జానకీరామయ్య వీఆర్వో స్వాతి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి ఫోన్లు అప్పగింత



భట్టిప్రోలు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరికి శనివారం పోలీసులు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా రూ. 30 వేలు వ్యయం చేసే రెండు ఫోన్లను ఎస్ఐ వై. సురేష్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ విజయ్, బి. అనిల్, బి. రవి అందజేశారు. రికవరీలో భాగంగా బాధితుల నుంచి వివరాలు సేకరించి ఫోన్లను అందించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసుల్ని ఎస్ఐ అభినందించారు.

సచివాలయానికి మంచినీటి యంత్రం బహూకరణ



బాపట్ల అర్బన్: నందిరాజుతోటలోని ఈస్ట్ బాపట్ల గ్రామ సచివాలయానికి శనివారం రూ. 7,500 విలువైన మంచినీటి యంత్రాన్ని మాజీ గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్ తన తండ్రి పీటా రాములు పేరిట అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సచివాలయం సిబ్బంది వేణుగోపాల్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

తెనాలి రూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన ప్రశాంత్ కిరణ్ శుక్రవారం రాత్రి రజక చెరువు సమీపంలోని కర్రీ పాయింట్ వద్దకు వెళ్లాడు. ఐతానగర్‌కు చెందిన బుడ్డా, దిడ్ల నాని మరి కొందరు ప్రశాంత్ కిరణ్‌ను తమ వెంట తీసుకెళ్లి దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్లకు ఇంటర్వ్యూలు



పేరెడ్ గ్రౌండ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పోలీసులు

బాపట్ల టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన మంజూరు చేసిన ఆరు డ్రైవర్ల పోస్టులకు శనివారం పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో డ్రైవింగ్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో భాగంగా తొలుత అభ్యర్థుల క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం డ్రైవింగ్, మెకానిజం స్కిల్స్, ట్రాఫిక్ రూల్స్‌పై ఇంటర్వ్యూలు నిర్వహించారు. డ్రైవింగ్ టెస్ట్‌లో ఏ మార్క్, 8 మార్క్, రివర్స్ చేయడంలో అభ్యర్థుల నైపుణ్యతను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంపిక ప్రక్రియను బాపట్ల ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్. ప్రేమ్ కుమార్, బాపట్ల ఆర్టీవో డి.బి.వి.రంగారావు, వెల్ఫేర్ ఆర్ఐ బి. శ్రీకాంత్ నాయక్ పర్యవేక్షించారు.

యువతలో పుస్తక పఠనాసక్తి పెంచడమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మయ్య, శివాజీ గణేషన్, సమితి సభ్యులు

బాపట్ల అర్బన్: నేటి తరానికి పుస్తకం గురించి, చదవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన పెంపొందించడానికి భావపురి పుస్తక ఉద్యమ సమితి ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు గోలి లక్ష్మయ్య తెలిపారు. యువతలో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా కవితలు, పద్యాలు, పుస్తక సమీక్షలు వంటి అన్ని ప్రక్రియల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. సమితి కార్యకలాపాలన్నీ శాఖ గ్రంథాలయ కేంద్రంగా జరుగుతాయని వెల్లడించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 ఎంట్రీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రథమ బహుమతిని కోనసీమ జిల్లాకు చెందిన డి. నాగజ్యోతి శేఖర్ కవిత (అక్షర గవాక్షం)కు, ద్వితీయ బహుమతిని భమిడిపాటి గౌరీశంకర్ పుస్తక సమీక్ష (ఆలోచనాత్మక అంతరంగ ఆవిష్కరణ) వైజాగ్‌కు చెందిన గుండాల జోగిరావు పుస్తక సమీక్ష (ఒక విజేత)కు, తృతీయ బహుమతిని గుంటూరు చెందిన గోలి విజయ (గజల్‌కు)కు అందించినట్లు గోలి లక్ష్మయ్య వెల్లడించారు. సమావేశంలో గ్రంథాలయ అధికారి ఏ. శివాజీ గణేషన్, సభ్యులు డాక్టర్ పి.సి. సాయిబాబు, పత్తిపాటి సుభాషిణి, ఏ. మల్లికార్జున, చిత్రకారుడు జీవి పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

14 మంది అరెస్టు



పోలీసుల అదుపులో పందెం రాయుళ్లు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శివారులో కోడి పందేల స్థావరంపై చందోలు ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో శుక్రవారం రాత్రి దాడి చేశారు. కోడి పందేలు వేస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3200తో పాటు 26 ద్విచక్ర వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భారీ బరి సిద్ధం

చందోలు శివారులో కోడి పందేల నిర్వహణకు పోలీసు శాఖ నుంచి అనుమతులు తీసుకున్నామని నిర్వాహకుల్లో కొందరు ప్రచారంతో పాటు బరి వద్ద విద్యుత్ లైటింగ్, కుర్చీలు, వసతుల్ని ఏర్పాటు చేయడం గమనార్హం. బరిలోకి ప్రవేశ రుసుంగా రూ.300 టికెట్ ధర కూడా నిర్ణయించడం విశేషం. ఇదంతా పోలీసు శాఖకు పూర్తి సమాచారం ఇచ్చామని, వారి నుంచి అనుమతి తీసుకున్నామని నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే, సమాచారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విషయం దావానంలా వ్యాపించింది.దీంతో చేసేదేమీలేక పోలీసులు దాడి చేశారని తెలుస్తోంది. టీడీపీకి చెందిన కొందరు నాయకుల కనుసన్నల్లో ఈ వ్యవహారం జరిగిందని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో కోడి పందేల నిర్వహణ చందోలు సమీపంలో ఇంతకు ముందెన్నడూ జరగలేదని, ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

నాటు సారా తయారుచేస్తే కఠిన చర్యలు



బెల్లం ఊట డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి

బాపట్ల టౌన్: నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ జి. వేణుగోపాలరెడ్డి తెలిపారు. మండలంలోని స్టువార్టుపురం, వెదుళ్లపల్లి గ్రామాల్లో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏడుగురు పోలీసు అధికారులు, 60 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈ దాడుల్లో 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సరైన పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా తయారుచేసినా, గంజాయి సరఫరా చేసినా, చోరీలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో 'బాబూజీ' ప్రదర్శన



సమావేశంలో దిలీప్‌రాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్

తెనాలి: ప్రముఖ రాజకీయనేత, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితచరిత్రపై పట్టణానికి చెందిన సినీదర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరిస్తున్న బయోపిక్ 'బాబూజీ' సినిమాలోని కొన్ని సన్నివేశాలను శనివారం ఉన్నతస్థాయి సమావేశంలో ప్రదర్శించారు. భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న వందమంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు హైదరాబాద్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన 'గ్లోబల్ ఇన్ ఫామ్ మేక' వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. కర్ణాటక మాజీ చీఫ్ సెక్రటరీ కె.రత్నప్రభ అధ్యక్షత వహించిన సమావేశంలో బాబూజీ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషనులో ప్రదర్శించినట్టు దిలీప్‌రాజా తెలియజేశారు. జగ్జీవన్ రామ్ పాత్ర పోషిస్తున్న మిలటరీ ప్రసాద్, సినిమాకు పనిచేస్తున్న సాంకేతిక నిపుణులు హాజరయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మిలటరీ ప్రసాద్‌ను అభినందించినట్టు వివరించారు.

హకీంజానీకి సరసభారతి ఉగాది పురస్కారం



షేక్ అబ్దుల్ హకీంజాని

తెనాలి: కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సాహిత్య, సాంస్కృతిక సంస్థ సరస భారతి వార్షిక ఉగాది పురస్కారానికి తెనాలికి చెందిన బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని ఎంపికయ్యారు. సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ నుంచి ఈ మేరకు ఆహ్వానం అందింది. గత మూడు దశాబ్దాలుగా హకీంజాని సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించినట్టు తెలియజేశారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం సరస భారతి ఆధ్వర్యంలో జరగనున్న శోభకృత్ ఉగాది వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. హకీంజాని బాలసాహిత్యంలో 36 పుస్తకాలు, 270 కథలు, 30 వయోచన వాచకాలతో కలుపుకొని 71 పుస్తకాలను రచించారు. మహారాష్ట్రలో 11, 12 తరగతుల పాఠ్యపుస్తకాల్లో హకీంజాని కథలను చేర్చారు. ఆయన కృషికి గాను పలు అవార్డులు లభించాయి.

వైద్య సేవలపై అవగాహన అవసరం

డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ హనుమంతరావు

తెనాలి అర్బన్: వైద్యసేవలపై మరింత అవగాహన పెంచుకోవాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు సూచించారు. డిస్ట్రిక్ రెసిడెన్సీ ప్రోగ్రాంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చిన 38 మంది పీజీ స్టూడెంట్స్‌తో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ వైద్యుల నుంచి మెలకువలను తెలుసుకోవాలని సూచించారు. అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని చెప్పారు.సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాల, ఎస్ఆర్ఐ, కాటూరి మెడికల్ కళాశాలల నుంచి 38మంది పీజీ స్టూడెంట్స్ వచ్చినట్లు తెలిపారు.